సాక్షి జగిత్యాల

మంగళవారం : 23 : మే : 2023



భగవద్గీతపై ప్రచారం

ధర్మపురి : లోక కల్యాణార్థం త్రైత సిద్ధాంత, భగవద్గీత గ్రంథాలపై నక్కలపేటలో సోమవారం విస్తృత ప్రచారం చేశారు.



విగ్రహ ప్రతిష్ఠాపన

జగిత్యాలరూరల్: వడ్డెరకాలనీ గుట్టపై నిర్మించిన శ్రీసీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు సోమవారం జరిగాయి.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 41.0/28.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. ఎండ తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

భాగ్యరెడ్డివర్మ సంఘ సంస్కర్త



నివాళి అర్పిస్తున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా

జగిత్యాల: దళిత వైతాళికుడు భాగ్యరెడ్డివర్మ గొప్ప సంఘసంస్కర్త అని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం భాగ్యరెడ్డివర్మ జయంతి ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆమె మాట్లాడుతూ, జగన్ మిత్రమండలి, మాన్య సంఘం, సంఘ సంస్కార నాటక మండలి, అహింస సమాజాన్ని స్థాపించి హైదరాబాద్ ప్రాంతంలో సంఘ సంస్కారం కోసం కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం ఆరబెట్టండి



ధాన్యం పరిశీలిస్తున్న ఆర్డీవో మాధురి

సారంగాపూర్(జగిత్యాల): అకాల వర్షంతో తడిసిన ధాన్యం ఆరబెట్టి వెంటనే తూకం వేయాలని ఆర్డీవో మాధురి సూచించారు. సారంగాపూర్, పెంబట్ల, కోనాపూర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం పరిశీలించారు. నిర్వాహకులు, రెవెన్యూ అధికారులకు పలు సూచనలు చేశారు. తూకం తీరుపై రైతులతో మాట్లాడి అవివరాలు అడిగి తెలుసుకున్నారు. పెంబట్ల, కోనాపూర్ తదితర గ్రామాల్లో కురిసిన వడగళ్ల వర్షంపై అధికారులను అడిగి నష్టంపై ఆరా తీశారు. తహసీల్దార్ రవీందర్‌రావు, ఆర్‌ఐ భాస్కర్‌రావు, ఏఈవో వెంకటేశ్, ఐకేపీ నిర్వాహకులు ఉన్నారు.

నేటినుంచి జిల్లాస్థాయి క్రీడా పోటీలు

జగిత్యాల: జిల్లాలో మంగళవారం నుంచి ఈనెల 25వ తేదీ వరకు జిల్లాస్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తామని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి నరేశ్ సోమవారం తెలిపారు. జిల్లాలోని 18 మండలాలు, జగిత్యాల మున్సిపాలిటీలో పోటీలు ఉంటాయన్నారు. 23న మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 3.30 గంటల వరకు క్రీడాకారుల పేర్ల రిజిస్ట్రేషన్, డ్రా ఉంటుందన్నారు. సాయంత్రం 4 గంటలకు క్రీడల పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఇందులో కబడ్డీ, వాలీబాల్, బాక్సింగ్, బాస్కెట్ బాల్ విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. క్లబ్‌లో బ్యాడ్మింటన్ పోటీలు ఉంటాయన్నారు. 24న మినీస్టేడియంలో వాలీబాల్, ఖోఖో, 25న ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, కబడ్డీ పోటీలు, స్థానిక ఎస్‌కేఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో విజేతలను రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు పంపిస్తామని ఆయన వివరించారు.

పుస్తకం ఆవిష్కరణ

జగిత్యాల: పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులకు తెలంగాణ సామాజిక, ఆర్థిక ముఖచిత్రం-2023 పుస్తకం ఉపయోగపడుతుందని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. కలెక్టరేట్‌లో పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ సామాజిక, ఆర్థిక పుస్తకం ముఖ్య ప్రణాళిక కార్యాలయంలో అందుబాటులో ఉందన్నారు. ప్రతి ఒక్కరూ కొనుగోలు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మకరంద్, లత పాల్గొన్నారు.

కొండగట్టు పాలకవర్గం ప్రమాణ స్వీకారం




ప్రవీ ప్రమాణ స్వీకరం చేసిన ట్రస్ట్‌బోర్డు సభ్యులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయ ట్రస్టు బోర్డు 13 మంది డైరెక్టర్లతో సోమవారం పదవీ ప్రమాణ స్వీకారం చేసింది. చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, ఆంజనేయస్వామి భక్తులు సేవ చేయడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. డైరెక్టర్ భక్తుల సేవలో తరలించాలని, ఇదే సమయంలో ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. పాత డైరెక్టర్లకే రెండోసారి ఆంజనేయస్వామి సేవ చేసేందుకు అవకాశం వచ్చిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచులు తిరుపతిరెడ్డి, సుదర్శన్, కృష్ణారావు, దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణప్రసాద్, ఈవో వెంకటేశ్ పాల్గొన్నారు.

అతలాకుతలం



జగిత్యాల సుతారిపేటలో చెట్టు విరిగిపడి ధ్వంసమైన గోడ



జగిత్యాల్లో కురిసిన వడగళ్లు

పుచ్చకాయ రైతు విలవిల

సారంగాపూర్(జగిత్యాల): సారంగాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో 8.2 మి.మీ. వర్షపాతం నమోదైయింది. పిడుగుల ధాటికి 18 గ్రామాల్లో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం ఏడు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వడగళ్లు, గాలివాన బీభత్సానికి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. అధికారులు తడిసిన ధాన్యంపై సమీక్షించారు. పెంబట్ల, కోనాపూర్, నాగునూర్, లచ్చక్కపేట, రంగపేట గ్రామాల్లో వడగళ్లు కురవడంతో కూరగాయ పంటలు, కొతపూర్తి చేసి ఆరబెట్టిన నువ్వు పంట, పుచ్చకాయ తదితర స్వల్పకాలిక పంటలపై తీవ్ర ప్రభావం పడింది. పెంబట్ల గ్రామంలో పుచ్చకాయ పంటకు తీవ్రంగా నష్టం వాటిల్లింది.

- ఈదురుగాలులు.. వడగళ్లు
- విరిగిన విద్యుత్ స్తంభాలు.. నిలిచిన కరెంట్ సరఫరా
- ధ్వంసమైన ఇళ్లు.. కొట్టుకుపోయిన ఇళ్ల పైకప్పులు
- మరోసారి ఉగ్రరూపం చూపిన వానదేవుడు
- మళ్లీ తడిసి ముద్దయిన వేల క్వింటాళ్ల వడ్లు

జగిత్యాల: అప్పటివరకు ఎండవేడితో తల్లడిల్లిన జిల్లావాసులు.. ఏసీలు, కూలర్లు ఆన్‌చేసి నిద్రలోకి జారుకున్నారు. సరిగ్గా ఆదివారం అర్ధరాత్రి 12.10 గంటల సమయంలో ఒక్కసారిగా ఈదురుగాలులతో కూడిన వడగళ్లు, భారీవర్షం కురవడం ప్రారంభమైంది. సారంగాపూర్, బీర్‌పూర్, పెగడపల్లి, రాయికల్ మండలాలతోపాటు జిల్లా కేంద్రంలో ఏకధాటిగా వర్షం కురిసింది. బలమైన గాలులు, ఆ వెంటే వడగళ్లు.. భారీవర్షం కురవడంతో ఏం జరుగుతుంతో తెలియక ప్రజలు రాత్రిళ్లు బిక్కుబిక్కుమంటూ గడిపారు.

జగిత్యాలలో..

ఉరుములు.. మెరుపులు.. ఆ వెంటనే వడగళ్లతో కూడిన భారీవర్షం జిల్లా కేంద్రాన్ని అతలాకుతలం చేసింది. ఈదురుగాలుల ధాటికి విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. తీగలు తెగిపడ్డాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సోమవారం ఉదయం 9 గంటల వరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ సాధ్యం కాలేదు. ప్రజలు జాగారం చేయాల్సి వచ్చింది. చెట్లు విరిగిపడి రాకపోకలు నిలిచిపోయాయి. బస్టాండ్, నిజామాబాద్, బైపాస్ రోడ్డు, ఖిలాగడ్డ, సుతారిపేట తదితర ప్రాంతాల్లో చెట్లు విరిగిపడగా మున్సిపల్ సిబ్బంది తొలగించారు. కొన్నిచోట్ల శిథిలావస్థలోని ఇళ్లు, ప్రహరీలు కూలిపోయాయి. కృష్ణానగర్‌లోని ఓ ఇంటిపై బాల్కనీ గోడ కూలింది. దానికింద ఉన్న ఇల్లు ధ్వంసమైంది. కుటుంబసభ్యులు అప్రమత్తమై బయటకు రావడంతో త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, డిష్‌లు, సైన్‌బోర్డులు కుప్పకూలాయి.



జగిత్యాల: బాల్కనీ గోడకూలి ధ్వంసమైన ఇల్లు

ఈదురుగాలుల బీభత్సం

రాయికల్(జగిత్యాల): పట్టణంతోపాటు 32 గ్రామాల్లో ఈదురుగాలుల బీభత్సం సృష్టించాయి. మూటపల్లి గ్రామంలో పెద్ద చెట్టు విరిగిపడింది. గ్రామస్తుడు రాజేశం బైక్‌పై చెట్టు పడిపోయింది.

ట్రాన్స్‌కో నష్టంరూ.5లక్షలు..

పెగడపల్లి(ధర్మపురి): రామబద్రునిపల్లి, రాజరాంపల్లి, ల్యాగలమర్రి, మ్యాకవెంకయ్యపల్లి, ఎల్లాపూర్, లింగాపూర్, సుద్దపల్లి తదితర గ్రామాల్లో 24 విద్యుత్ స్తంబాలు విరిగిపడ్డాయి. ట్రాన్స్‌కోకు సుమారు రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు ఏఈ శ్రీనివాస్ తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరిస్తున్నట్లు పేర్కొన్నారు. రామబద్రునిపల్లిలో ముత్యాల రామస్వామి, నర్సింహునిపేటలో జంగిలి లత ఇళ్ల రేకులు చెల్లాచెదురయ్యాయి. పలు గ్రామాల్లో 18 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. జెడ్పీటీసీ రాజేందర్‌రావు బాధితులను పరామర్శించారు. రెవెన్యూ అధికారులు పరిశీలించి నష్టాన్ని అంచనా వేస్తున్నట్లు తహసీల్దార్ కృష్ణచైతన్య తెలిపారు.



రాయికల్ : మోటపల్లిలో బైక్‌పై విరిగి పడ్డ చెట్టు



జగిత్యాల ఓల్డ్ హైస్కూల్‌లో నిలిచిన వర్షపునీరు



పెగడపల్లి : రాంబద్రునిపల్లిలో ధ్వంసమైన షెడ్డు

ప్రజావాణికి ప్రాధాన్యం ఇవ్వండి

- కలెక్టర్ యాస్మిన్ బాషా ఆదేశం
- ఇళ్ల పట్టాల కోసం మూడోసారి అర్జీ ఇచ్చిన సర్పంచ్

జగిత్యాల: ప్రజావాణి ద్వారా అర్జీల రూపంలో అందే సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా కేంద్రంతోపాటు వివిధ ప్రాంతాల నుంచి అనేక వ్యయ ప్రయాసాలకోర్చి అభాగ్యులు వచ్చారని, అధికారులు తమ శాఖల వారీగా స్వీకరించిన ఫిర్యాదులకు సానుకూలంగా స్పందించాలని అన్నారు. అర్జీలను పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. సోమవారం 21 ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు. ఇందులో ఎక్కువగా భూ సమస్యలపైనే ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మకరంద్ తదితరులు పాల్గొన్నారు.

ముచ్చటగా మూడోసారి

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలం కోమన్‌పల్లి భూముల్లో పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలని సర్పంచ్ సీపతి రమేశ్ సోమవారం కలెక్టర్ యాస్మిన్ బాషాకు ప్రజావాణి ద్వారా వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజావాణి ద్వారా సమస్య పరిష్కారం కోసం దరఖాస్తు చేయడం ఇది మూడోసారి అని సర్పంచ్ తెలిపారు. కోమన్‌పల్లి, డొంకేశ్వరంలో 676 ఎస్సారెస్పీ ముంపు బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం, వ్యవసాయం కోసం భూములు కేటాయించిందని ఆయన అన్నారు. నిర్వాసితులు వ్యవసాయ భూములు విక్రయించి, ఇళ్ల స్థలాలు వదిలేసి ఎటో వెళ్లిపోయారన్నారు. దాదాపు 30ఏళ్లుగా ఇళ్ల స్థలాల్లో కోమన్‌పల్లి, డొంకేశ్వరం పేదలు నివాసం ఉంటున్నారని అన్నారు. ఆ స్థలాల్లో రెండు గ్రామాల పేదలకు పట్టాలివాలని ఇప్పటికే రెండుసార్లు ప్రజావాణి ద్వారా అర్జీ సమర్పించానని, ఇది మూడోసారి అని సర్పంచ్ వివరించారు. కాగా, తన దరఖాస్తుపై స్పందించిన కలెక్టర్.. వెంటనే నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు సర్పంచ్ తెలిపారు.



దరఖాస్తు చేస్తున్న సర్పంచ్ రమేశ్

అందరూ ‘పోయారు’.. నేనెందుకు బతకాలి?

- మనస్తాపంతో మహిళ ఆత్మహత్య



సుమలత(ఫైల్)

ధర్మపురి(బుగ్గారం): ‘పుట్టుకతోనే కొడుకును కోల్పోయిన.. రోడ్డు ప్రమాదంలో కూతురు చనిపోయింది.. వారి మరణాన్ని తట్టుకోలేని నా భర్త మనస్తాపంలో మంచం పట్టిండు.. ఆ తర్వాత ఆయనా పోయిండు.. నాకు తోడుగా ఉండే నా తల్లి కూడా చనిపోయింది.. ఇక నేనెవరి కోసం బతకాలి’ అని తీవ్రంగా మదనపడిన మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన బుగ్గారం మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బుగ్గారం మండల కేంద్రానికి చెందిన పన్నాటి సుమలత(38)కు జిల్లాలోని మల్యాల మండల కేంద్రానికి చెందిన గంగాధర్‌తో 2014లో వివాహమైంది. ఈ దంపతులకు కొడుకు పుట్టగానే చనిపోయాడు. ఆ తర్వాత కొంతకాలానికి కూతురు జన్మించింది. కొన్నేళ్లక్రితం ఆ బాలిక రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఇద్దరు పిల్లలు మృతి చెందారనే మనస్తాపానికి గురైన గంగాధర్.. అనంతరం అనారోగ్యం బారిన పడ్డాడు. ఆ తర్వాత కొద్దిరోజులకే అతడూ మరణించాడు. దిక్కుమొక్కులేని సుమలత.. పుట్టింటికి చేరుకుంది. కొన్నిరోజులుగా తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. అయితే, ఆమె తల్లి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. నా అనుకున్న వారంతా ఒక్కొక్కరుగా చనిపోతుండడంతో తట్టుకోలేని సుమలత.. తీవ్ర మనస్థాపనకు గురైంది. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. తండ్రి లక్ష్మీరాజం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

షుగర్ ఫ్యాక్టరీ తెరిపించండి

- పీసీసీ నాయకుడు జువ్వాడి కృష్ణారావు

మల్లాపూర్(కోరుట్ల): నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరిపించాలని పీసీసీ నాయకుడు జువ్వాడి కృష్ణారావు డిమాండ్ చేశారు. ముత్యంపేట పెద్దమ్మ ఆలయం నుంచి కాంగ్రెస్ శ్రేణులు, చెరుకు రైతులు, మహిళలతో కలిసి నిజాం షుగర్ ఫ్యాక్టరీ వరకు సోమవారం పాదయాత్ర నిర్వహించారు. పరిశ్రమ ఎదుట ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ, తాము అధికారంలోకి వస్తే 100రోజుల్లోనే నిజాం షుగర్ ఫ్యాక్టరీలు స్వాధీనం చేసుకుంటామన్న టీఆర్ఎస్, ఎంపీగా గెలిస్తే చెరుకు రైతుల కోసం సొంత డబ్బు వెచ్చించి ఫ్యాక్టరీ కొనుగోలు చేసి నడుపుతానన్న బీజేపీ ఎంపీ అర్వింద్.. ఆ హామీలు విస్మరించడం శోచనీయమన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయమని చెబుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. చెరుకురైతుల గోడు విస్మరించడం దారుణమని మండిపడ్డారు. బంగారు తెలంగాణ అంటే వ్యవసాయాధారిత పరిశ్రమలైన చక్కెర ఫ్యాక్టరీలను మూసివేయడమేనా? అని ప్రశ్నించారు. వచ్చే అక్టోబర్ వరకు ప్రతినెలా 22న ఒక్కో గ్రామం నుంచి షుగర్ ఫ్యాక్టరీ వరకు పాదయాత్ర నిర్వహిస్తామన్నారు. అనంతరం సీఎం కేసీఆర్, ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు దిష్టిబొమ్మలు దహనం చేశారు. నాయకులు మామిడి నారాయణరెడ్డి, కంది బుచ్చిరెడ్డి, అందె మారుతి, పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, చింతలపెల్లి రాజేశ్వర్‌రెడ్డి, వాకిటి వెంకట్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, రాజం, లింగారెడ్డి ఉన్నారు.



ఫ్యాక్టరీ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు, నేతలు

బంద్ విజయవంతం

- స్వచ్ఛందంగా మూతపడ్డ వ్యాపార, వాణిజ్య సంస్థలు
- జిల్లా కేంద్రంలో రైతు సంఘాల బైక్‌ర్యాలీ
- మెట్‌పల్లి, కోరుట్లలో అన్నదాతల ధర్నాలు



కోరుట్లలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న రైతులు, రైతు సంఘం నాయకులు



జగిత్యాలలో రైతు సంఘాల బైక్‌ర్యాలీ

జగిత్యాల: ధాన్యం కొనుగోళ్లలో జాప్యం, తూకంలో తరుగు, తాలు పేరిట దోపిడీని నిరసిస్తూ రైతు సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం జిల్లా బంద్ విజయవంతమైంది. ఉదయం నుంచే రైతు సంఘాల నాయకులు జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. బంద్‌కు సహకరించి, రైతుల ఆందోళనకు మద్దతు తెలపాలని వ్యాపార, వాణిజ్య సంస్థల నిర్వాహకులకు విన్నవించారు. దీంతో చిరువ్యాపారులు స్వచ్ఛందంగా బంద్‌కు మద్దతు తెలిపారు. రైతులు పెద్దఎత్తున జగిత్యాలకు తరలివచ్చి ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో రైస్ మిల్లర్లు రైతులను అందినకాడికి దోచుకుంటున్నారని పేర్కొన్నారు. బంద్‌కు సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి, మల్లన్న, కరుణాకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, సాయిరెడ్డి, మల్లేశ్, సోమేశ్ పాల్గొన్నారు.



జగిత్యాలలో మూతపడ్డ దుకాణాలు



మెట్‌పల్లిలో రాస్తారోకో చేస్తున్న నాయకులు

అక్రమాలను అరికట్టాలి

మెట్‌పల్లి(కోరుట్ల): ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలను అరికట్టాలనే డిమాండ్‌తో స్థానిక పాత బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై రైతు సంఘాల నాయకులు రాస్తారోకో నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు సంఘీభావం తెలిపారు. రైతులు మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో అధికారులు, మిల్లర్లు కలిసి పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. రైతులకు భారీగా నష్టం జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. నాయకులు జువ్వాడి కృష్ణారావు, మామిడి నారాయణరెడ్డి, బద్దం శ్రీనివాస్‌రెడ్డి, గురిజెల రాజిరెడ్డి, కొమిరెడ్డి లింగారెడ్డి, అందె మారుతి, బెజ్జారపు శ్రీనివాస్, ఇల్లెందుల రాజు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ధర్నా

కోరుట్లరూరల్: స్థానిక మార్కెట్ యార్డులో ధాన్యం పోసిన రైతులు.. ఆ తర్వాత కొత్త బస్టాండ్ జాతీయ రహదారి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అక్కడ ధర్నా చేశారు. కోరుట్ల పీఏసీఎస్ సీఈవో బుచ్చయ్య అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తహసీల్దార్ రాజేశ్ రైతుల వద్దకు చేరుకుని ఆందోళన విరమించాలని నచ్చజెప్పారు. రైతులు వినిపించుకోలేదు. అయితే, ఆర్డీవోకు వినతిపత్రం ఇవ్వాలని తహసీల్దార్ సూచించటంతో రైతులు ధర్నా విరమించి ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. రైతులు సుతారి రాకేశ్, ఎలిశెట్టి రాజేశం, చెట్లపెల్లి సాగర్, దమ్మా సంతోష్, గూడ మహేశ్, గోనెల రమేశ్, మనోజ్, వెంకటేశ్, రాజన్న, రాములు, రాజు, ఎలిశెట్టి గంగారెడ్డి, ఎలిశెట్టి చిన్నారెడ్డి, పుప్పాల గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

రైతుల ముసుగులో రాజకీయ కుట్రలు

- బంద్‌కు స్పందన కరువు
- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: జగిత్యాల బంద్‌కు పిలుపునిచ్చింది నిజమైన రైతులు కాదని, రైతుల ముసుగులో బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు బంద్ నిర్వహించారని, రైతులను మరిన్ని కష్టాలపాలు చేశారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ విమర్శించారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతుపక్షపాతి సీఎం కేసీఆర్ అని, వారి సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టారని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ధాన్యం దిగుబడి పెరిగిందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తరుగు, కోతలు లేవని, ఎక్కడో ఒకచోట జరిగిన వాటిని చూపుతూ రైతులను తప్పుదోవ పట్టించేందుకు ప్రతిపక్ష పార్టీలు కుట్ర చేస్తున్నాయని ఎమ్మెల్యే సంజయ్ దుయ్యబట్టారు. రైతులే కోతలు లేవని చెబుతున్నారని పేర్కొన్నారు. బంద్ ప్రభావం పెద్దగా లేదని అన్నారు. పెట్రోల్ బంక్‌లపై కొంత ఉందని, దీంతో లారీలకు డీజిల్ దొరకక ధాన్యం తరలింపులో జాప్యం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, బీజేపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే రంగుమారిన ధాన్యాన్ని ఎఫ్‌సీఐతో కొనుగోలు చేయించాలని సూచించారు. జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, చివరి గింజ వరకూ ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దామోదర్‌రావు, నాయకులు నక్కల రవీందర్‌రెడ్డి, సందీప్‌రావు, మహేశ్, దామోదర్‌రావు, మహిపాల్‌రెడ్డి, జుంబర్తి శంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

క్లుప్తంగా

నేడు జిల్లాస్థాయి క్రీడా పోటీలు

జగిత్యాలరూరల్: జిల్లాస్థాయి సీఎం కప్ ఆటల పోటీలు మంగళవారం స్థానిక మినీస్టేడియంలో నిర్వహించనున్నట్లు జగిత్యాల రూరల్ ఎంపీపీ రాజేంద్రప్రసాద్ సోమవారం తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సహకార సంఘం చైర్మన్లు సాయంత్రం 4 గంటలకు వివేకానంద స్టేడియంలో హాజరు కావాలని ఆయన కోరారు.

మంత్రి కేటీఆర్ పీఎస్ శ్రీనివాస్‌కు పరామర్శ


శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాష్ట్ర మంత్రి కేటీఆర్ పీఎస్ కానుగుల శ్రీనివాస్ తల్లి రాములమ్మ అనారోగ్యంతో మరణించగా.. వారి కుటుంబ సభ్యులను నల్లగొండలోని వారి స్వగృహం ఎల్లారెడ్డిపేటకు చెందిన నాయకులు సోమవారం పరామర్శించారు. రాములమ్మ మృతికి గల కారణాలు తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్లు అందె సుభాష్, గుల్లపల్లి నర్సింహారెడ్డి ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కోనరావుపేట : మండలంలోని వెంకట్రావుపేటలో నిర్మిస్తున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి బావుసాయిపేటకు చెందిన షేక్ యూసుఫ్–నౌసిన్ దంపతులు తమవంతు విరాళం అందించారు. గ్రామంలో సర్పంచ్ మంతెన సంతోష్ ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మిస్తున్నారు. బావుసాయిపేటకు ముస్లిం దంపతులు విరాళాన్ని ఆలయ చైర్మన్ వడ్నాల రవీందర్‌కు అందజేశారు.

తాత్కాలిక ఉద్యోగుల బదిలీలకు దరఖాస్తులు

సిరిసిల్లకల్చరల్: సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లా, మండల స్థాయిలో తాత్కాలిక, ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని డీఈవో రమేశ్‌కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లు, కోఆర్డినేటర్లు, సమ్మిళిత విద్యా రిసోర్స్ పర్సన్లు, సిస్టమ్ అనలిస్టులు, అసిస్టెంట్ ప్రోగ్రామింగ్ ఆపరేటర్లు పరస్పర బదిలీలు, అంతర్ జిల్లా పరస్పర బదిలీలు కోరుకుంటే తమ అభ్యర్థనలు అందజేయాలని పేర్కొన్నారు. పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్ rchooedu. teanfana. gov.in/M ఆన్‌లైన్‌లో ఈనెల 25లోపు వివరాలు సమర్పించాలని సూచించారు. దంపతులు, ఇతర ప్రిఫరెన్షియల్ కేటగిరీల వారు సంబంధిత ఆధారాలతో దరఖాస్తు చేయాలని తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులోని కేశోపేరమాండ్ల గుట్ట వద్ద పేకాటాడుతున్న ఆరుగురిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.21,690 నగదు, నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నగదు స్వాధీనం చేసుకోవడంతోపాటు ఆరుగురిని రిమాండ్‌కు తరలించినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ రవీందర్‌రెడ్డి తెలిపారు.

ఇంటర్‌లో ప్రవేశాల ప్రక్రియ షురూ

- జిల్లాలో 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు
- 13 మోడల్ స్కూళ్లల్లో దరఖాస్తుల ఆహ్వానం



కథలాపూర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల

కథలాపూర్(వేములవాడ): పదో తరగతి ఫలితాలు వెలువడటంతో జూనియర్ కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల ప్రక్రియ ప్రారంభిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈమేరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, మోడల్ స్కూళ్లలో ప్రిన్సిపాల్స్ అడ్మిషన్లకు సంబంధించి ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభించారు. జిల్లాలో ప్రైవేట్ జూనియర్ కళాశాలలు 24 ఉండగా.. వీటికి సంబంధించిన అడ్మిషన్ల ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభంకాలేదని జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి నారాయణ బుధవారం తెలిపారు. ఇంటర్ బోర్డు ఆదేశాల ప్రకారం జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు.

15 ప్రభుత్వ జూనియర్ కళాశాలు.. 6 వేల సీట్లు..

- జిల్లాలో 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ కోర్సులతోపాటు ఒకేషనల్ కోర్సులు ఇంగ్లిష్, తెలుగు మీడియంలో అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు.
- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీలో ఒక్కో కోర్సులో 44 సీట్లు ఉంటాయని, అడ్మిషన్లు తీసుకునే విద్యార్థుల సంఖ్య పెరిగితే అదనపు సీట్లకు అనుమతి ఇస్తామని జిల్లా విద్యాశాఖ వెల్లడించింది.
- ప్రస్తుతం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 6 వేల సీట్లు ఉన్నాయి.
- అడ్మిషన్లు తీసుకునే విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- లేదా నేరుగా కళాశాలలకు వెళ్లి వివరాలు అందిస్తే సీట్లు కేటాయిస్తారు.

13 మోడల్‌స్కూళ్లు.. 2,080 సీట్లు..

జిల్లాలో 13 మోడల్ స్కూళ్లు ఉన్నాయి. ఇందులో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సులు ఇంగ్లిష్ మీడియంలో మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఒక్కో కోర్సులో 40 సీట్లు మాత్రమే ఉండగా.. ఒక్కో మోడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరంలో 160 సీట్లు మాత్రమే ఖాళీగా ఉంటాయి. అడ్మిషన్లు తీసుకునే విద్యార్థులు ఈనెల 25వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ఐదు కేజీబీవీల్లో ఇంటర్ కోర్సులు..

- జిల్లాలో జగిత్యాల అర్బన్, వెల్గటూర్, కోరుట్ల, ఇబ్రహీంపట్నం, రాయికల్‌లోని కేజీబీవీల్లో ఇంటర్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు.
- జగిత్యాల అర్బన్, కోరుట్ల, వెల్గటూర్‌లోని కేజీబీవీల్లో ఎంపీసీ, బైపీసీ కోర్సులు మాత్రమే ఉండగా... ఒక్కో కోర్సులో 40 సీట్లకు అనుమతి ఉంది.
- ఇబ్రహీంపట్నం, రాయికల్‌లోని కేజీబీవీల్లో సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులుండగా.. ఒక్కో కోర్సుకు 40 సీట్లు కేటాయించారు.
- ఇందులో విద్యార్థినులకు మాత్రమే ప్రవేశాలు కల్పిస్తారు.
- అడ్మిషన్లు తీసుకునే బాలికలు నేరుగా సంబంధిత విద్యాలయానికి వెళ్లి తగిన ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తే కాలేజీలో చేర్చుకుంటారు.

సద్వినియోగించుకోవాలి



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అన్ని వసతులు ఉన్నాయి. పూర్తిస్థాయిలో లెక్చరర్లు ఉన్నారు. మంచిబోధన అందిస్తున్నాం. ప్రభుత్వ కళాశాల్లో చేరితే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, స్కాలర్‌షిప్ సౌకర్యం ఉంది. ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగించుకోవాలి.

– నారాయణ, జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి

వాట్సాప్‌లో వ్యాఖ్యలపై కేసు

ముస్తాబాద్(సిరిసిల్ల): వాట్సాప్ గ్రూప్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్సై వెంకటరమణ తెలిపిన వివరాలు. ముస్తాబాద్ మండలం తెర్లుమద్దికి చెందిన పర్శరాములు సర్పంచ్, ఎంపీటీసీ తనయుడిపై వాట్సాప్ గ్రూప్‌లో అసత్య ఆరోపణలు చేశారనే ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. వారం క్రితం పర్శరాములు తెర్లుమద్ది గ్రామ వాట్సాప్ గ్రూప్‌లో ప్రభుత్వ భూముల కేటాయింపులో పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. పేదలకు పట్టాలివ్వాలని, ఐకేపీ కొనుగోలు కేంద్రానికి స్థలాన్ని కేటాయించాలనే ఉద్దేశంతో తాము పనిచేస్తుంటే తమను అవమానించేలా పర్శరాములు వ్యాఖ్యలు చేశారని సర్పంచ్ కిషన్‌రావు, బైతి నవీన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యాలయం వద్ద నిజనిరూపణకు రావాలని పిలిస్తే.. తమపై దౌర్జన్యం చేశారని పేర్కొన్నారు. ఈ రెండు ఘటనలపై ఫిర్యాదుతో పర్శరాములుపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఏఎస్సై తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

బోయినపల్లి : మండలంలోని కొదురుపాకలో మండల బీజేపీ యువ నాయకులు అనిల్, నాగరాజుతో పాటు పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, రాష్ట్ర నాయకుడు జోగినిపల్లి రవీందర్ రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీపీ వేణుగోపాల్, జెడ్పీటీసీ ఉమ, తదితరులు పాల్గొన్నారు.

మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని ధర్నా


అధికారులతో మాట్లాడుతున్న అడ్లూరి లక్ష్మణ్ కుమార్

వెల్గటూర్ : తరుగు పేరిట క్వింటాల్‌కు ఎనిమిది కిలోల కోత పెడుతున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎండపల్లి మండలం అంబరిపేట స్టేజీ వద్ద రాష్ట్ర రహదారిపై సోమవారం డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో రెండు వందల మంది రైతులతో కలిసి కాంగ్రెస్ నాయకులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 45 రోజులు గడిచినా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు అలాగే ఉన్నాయన్నారు. రైతులు ఇబ్బందులు పడుతుంటే మంత్రి కొప్పుల ఈశ్వర్ మాత్రం ఇతర పార్టీల వారిని బీఆర్‌ఎస్‌లో చేర్చుకునే పనిలో ఉన్నారన్నారు. అకాలవర్షానికి ధాన్యం తడిసి మొలకలు వచ్చినా రైతులకు భరోసా కల్పించలేదని ఎద్దేవా చేశారు. మంత్రికి పార్టీలో చేరికలపై ఉన్న శ్రద్ధ రైతులపై లేదన్నారు. ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. జిల్లా అదనపు కలెక్టర్‌కు ఫోన్‌లో విన్నవించగా, నిబంధనలు ఉల్లంఘించిన మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. ఇక్కడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్ రెడ్డి, సర్పంచులు మురళి, జగదీశ్వర్ రెడ్డి, ఎంపీటీసీ అనుమాల మంజుల, మండల కాంగ్రెస్ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయండి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి


ధాన్యం పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. చల్‌గల్ సహకార సంఘం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సోమవారం సందర్శించారు. కొనుగోలు కేంద్రంలో తూకం వేసిన 4 వేల బ్యాగులను లారీలు లేక తరలించడం లేదని, తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అదనపు కలెక్టర్ లతతో ఆయన ఫోన్లో మాట్లాడి ధాన్యం సంచులు తరలించడంతోపాటు హమాలీల సంఖ్య పెంచి కొనుగోళ్లు వేగవంతం చేయాలని కోరారు. ఆయన వెంట జున్ను రాజేందర్, రైతులు ఉన్నారు.

రైస్‌మిల్లర్ల దోపిడికి ప్రభుత్వానిదే బాధ్యత

రాయికల్(జగిత్యాల): రైస్‌మిల్లర్ల దోపిడీకి ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. స్థానిక మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్సీ సందర్శించి మాట్లాడారు. ధర్మకాంటా తూకం అనుగుణంగా రైస్‌మిల్లర్లు దిగుమతి చేసుకోవాలని, కానీ, అందులో కోత విధిస్తూ రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. మొక్కజొన్న కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతోందని, అధికారులు స్పందించకపోతే ఆందోళన చేయకతప్పదని హెచ్చరించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజిరెడ్డి, నాయకులు ఆదిరెడ్డి, మ్యాకల రమేశ్, మండ రమేశ్, లింగంగౌడ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కేసీఆర్‌నగర్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత


అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలం మండెపల్లి డబుల్ బెడ్‌రూమ్(కేసీఆర్ నగర్) సముదాయంలోని అక్రమ నిర్మాణాలను సోమవారం సిరిసిల్ల మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. తంగళ్లపల్లి ఎస్సై పి.లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు. టౌన్ ప్లానింగ్ అధికారులు మాట్లాడుతూ కేసీఆర్‌నగర్‌లో అనుమతులు లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమిస్తే డబుల్ బెడ్ రూమ్ ఇంటి పట్టాను రద్దు చేస్తామన్నారు.

రైతులను నిలువు దోపిడీ చేస్తున్న వ్యాపారులు


సమావేశంలో మాట్లాడుతున్న ఉమేశ్‌రావు

సిరిసిల్లటౌన్: ధాన్యం కొనుగోళ్లలో వ్యాపారులు నిలువు దోపిడీ చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి చీటి ఉమేశ్ రావు అన్నారు. సోమవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తరలింపుపై ప్రశ్నిస్తే లారీల కొరత అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి కేటీఆర్ రైతుల అవస్థలు పట్టించుకోకుండా విదేశాలు తిరుగుతున్నారని విమర్శించారు. ముస్తాబాద్ మండలంలో కాంగ్రెస్‌లో చేరిన కార్యకర్తలను అధికార పార్టీ నాయకుడు బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. పోలీసు వ్యవస్థ బీఆర్‌ఎస్‌కు వత్తాసు పలకడం శోచనీయమన్నారు. సమావేశంలో చుక్క శేఖర్, గిరిధర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాజశేఖర్, దుర్గారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

‘డబుల్’ ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయాలి


మాట్లాడుతున్న గుంటి వేణు

సిరిసిల్ల అర్బన్: డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేసి లబ్ధిదారులకు అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సిరిసిల్ల మున్సిపల్ పరిధి రగుడులో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయాన్ని సీపీఐ నాయకులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, తాగునీటి, తదితర మౌలిక వసతులను కల్పించడం లేదన్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్లను పంపిణీ చేస్తామని అధికారులు హడావుడి చేస్తున్నారే తప్ప పనులను వేగవంతం చేయడం లేదన్నారు. అధికారులు ఈ విషయంపై దృష్టిసారించాలని, లేకపోతే లబ్ధిదారులతో కలెక్టర్ ఎదుట పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నాయకులు పట్టణ కార్యదర్శి పంతం రవి, నాయకులు రమేశ్, మల్లేశం గౌడ్, నాగరాజు, లక్ష్మణ్, మోహన్, తదితరులున్నారు.

‘ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలి’

సిరిసిల్ల టౌన్ : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ వెంటనే పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందుల నరేశ్ అన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగలు, ఉపకులాల ప్రజలు ఐక్యతతో ముందుకెళ్లాలన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జి ఆవునూరి ప్రభాకర్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జి ఖానాపురం లక్ష్మణ్, సుంకపాక దామోదర్, తంగళ్లపల్లి దేవరాజు, నేరెళ్ల శ్రీని వాస్, నేదునూరి నర్సయ్య, జాలపెల్లి దేవయ్య, అందే సతీశ్, కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

సీల్డ్ టెండర్లకు ఆహ్వానం

జగిత్యాల : 2023–24 సంవత్సరానికి గాను జిల్లా పరిధిలో ఆరు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఆహార పదార్థాలు, కిరాణం, శానిటేషన్ సామగ్రి, కూరగాయలు, పండ్లు, కోడిగుడ్లు, క్యాటరింగ్ సర్వీస్, ల్యాబ్ మెటీరియల్, స్టేషనరీ సామగ్రి కోసం అధీకృత డీలర్ల నుంచి సీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు అదనపు కలెక్టర్ లత తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ఆసక్తి గలవారు రూ.వెయ్యి డీడీతో టెండర్ ఫారాలు 22 నుంచి 27 వరకు మేడిపల్లి టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ కార్యాలయంలో లభిస్తాయన్నారు. 29న సాయంత్రం 4 గంటలలోపు టెండర్లు వేయాలన్నారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ కార్యాలయంలో 30న జిల్లా కొనుగోలు కమిటీ సమక్షంలో తీయనున్నట్లు తెలిపారు. మరిన్న వివరాలకు మేడిపల్లి టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ కళాశాలలో సంప్రదించాలన్నారు.

పార్లమెంట్ భవనాన్ని రాష్ట్రపతి ప్రారంభోత్సవం చేయాలి

ధర్మపురి : పార్లమెంట్ భవన ప్రారంభోత్సవాన్ని రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయాలని వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మోకెనపెల్లి రాజమ్మ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ఆమె మాట్లాడుతూ దేశ ప్రజల సహాయ సహకారాలతోనే నిర్మాణం జరిగిందని, బీఆర్ అంబేడ్కర్ రాసిన 85వ ఆర్టికల్ ప్రకారం రాష్ట్రపతికే ప్రారంభించేందుకు అర్హత ఉంటుందన్నారు.

రైస్ మిల్లర్ల దోపిడీని అరికట్టాలి

సిరిసిల్ల అర్బన్ : రైస్ మిల్లర్ల దోపిడీని అరికట్టాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ మాట్లాడారు. జిల్లాలో ఇప్పటికే వడగళ్ల వానతో రైతులు నష్టపోయారని, ధాన్యాన్ని అమ్ముకునే సమయంలో రైస్ మిల్లర్లు తరుగు పేరిట దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. బస్తాకు నాలుగు నుంచి ఐదు కిలోల తరుగు పేరిట ధాన్యాన్ని కటింగ్ చేస్తున్నారన్నారు. అధికారులు స్పందించి రైస్ మిల్లులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీలను భర్తీ చేయాలి

వేములవాడరూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లోని అటెండర్, వాచ్‌మన్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మొగిలి లక్ష్మణ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన వేములవాడలో మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల్లో ఎన్నో ఏళ్లుగా అటెండర్, వాచ్‌మన్‌లతో పాటు ఇతర పోస్టులు ఖాళీగా ఉన్నాయని, విషయంపై పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. పీఆర్సీ గడువు ముగుస్తున్నందున నూతన పీఆర్సీ కమిటీని వెంటనే వేయాలని, కేజీబీవీ సీఆర్టీ స్పెషల్ ఆఫీసర్ల బదిలీల్లో లాంగ్ స్టాండింగ్ నిబంధనతో వారికి బదిలీ అవకాశాలు కల్పించాలని ఆయన కోరారు. ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న సీఆర్‌టీల సేవలను పాఠశాల పునఃప్రారంభం నాటికి రెన్యువల్ చేయాలని అన్నారు. సంఘం రాష్ట్ర అకాడమిక్ కో కన్వీనర్ బొగ్గారపు నవీన్, వేములవాడ అధ్యక్షుడు మెడపట్ల కిషన్, రుద్రంగి మండల ప్రధాన కార్యదర్శి మహేశ్, తదితరులున్నారు.

నియామకం

ముస్తాబాద్(సిరిసిల్ల): భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి జిల్లా కమిటీ అధ్యక్షుడిగా మండలకేంద్రానికి చెందిన మూసర్ల లింగారెడ్డిని నియమించారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ సోమవారం నియామకపత్రం అందజేశారు. వికలాంగుల హక్కుల పరిరక్షణకు బీవీహెచ్‌పీఎస్ కృషి చేస్తుందని, తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడికి, దివ్యాంగులకు లింగారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో దివ్యాంగులంతా ఐక్యంగా ఉండాలన్నారు.

రోడ్డు సమస్యను పరిష్కరించాలి

- బహుజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు లింగంపల్లి నరేశ్


ధర్నా చేస్తున్న నాయకులు, కాలనీవాసులు

మల్లాపూర్ : సిరిపూర్ గ్రామంలోని గోసంగి కాలనీ రోడ్డు సమస్యను పరిష్కరించాలని బహుజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు లింగంపెల్లి నరేశ్ డిమాండ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని భరత మాత కూడలి వద్ద తెలంగాణ గౌడ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోగేటి శరత్‌గౌడ్, కాలనీవాసులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిరిపూర్‌లోని గోసంగి కాలనీలో 50 కుటుంబాలు నివసిస్తున్నాయని, కాలనీవాసులు వెళ్లే రోడ్డు కబ్జాకు గురైందని, నాలుగేళ్లుగా కాలనీవాసులు రోడ్డుకోసం పోరాటం చేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారన్నారు. గోసంగి కాలనీ రోడ్డు సమస్యను తక్షణమే పరిష్కరించాలన్నారు. ఇక్కడ బహుజన సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు బోడ ప్రశాంత్, కులసంఘం పెద్ద మనుషులు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

గుడుంబాను అరికట్టేందుకు చర్యలు


స్వాధీనం చేసుకున్న గుడుంబా



బస్సును తనిఖీ చేస్తున్న పోలీసులు

- ఎస్పీ భాస్కర్

జగిత్యాల క్రైం: నిషేధిత గుడుంబాను అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ ఎగ్గడి భాస్కర్ పేర్కొన్నారు. సోమవారం ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో గుడుంబా, బట్టీలు, గుడుంబా స్థావరాలపై తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రాయికల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గుడుంబాను అరికట్టేందుకు పోలీసు, ఎక్సైజ్ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. గుడుంబా రహిత జిల్లాగా మార్చేందుకు అధికారులు కృషి చేయాలని ఎస్పీ సూచించారు.

అక్రమ మద్యం రవాణాను అరికట్టాలి

జగిత్యాల క్రైం: ఇతర రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం రవాణాను అరికట్టాలని ఎస్పీ భాస్కర్ అన్నారు. సోమవారం ఎస్పీ ఆదేశాల మేరకు వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ట్రాన్స్‌పోర్ట్‌లు, బస్సులను పోలీసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాలోకి అక్రమ మద్యం రవాణా అయ్యే అవకాశం ఉందని, పోలీసు, ఎక్సైజ్ శాఖ అక్రమ మద్యంపై పటిష్ట చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- మరొకరికి తీవ్రగాయాలు


క్షతగాత్రుడికి నీరు తాగిపిస్తున్న ఎంవీఐ రంజిత్

కోరుట్ల రూరల్ : మండలంలోని వెంకటాపూర్ బస్టాండ్ వద్ద జాతీయ రహదరిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మేడిపెల్లి మండలం మన్నేగూడెం గ్రామానికి చెందిన పంచిరి హన్మాండ్లు (53) అక్కడికక్కడే మృతిచెందగా కొత్తపెల్లి రాజం (60)కు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. మన్నెగూడెంకు చెందిన పంచిరి హన్మాండ్లు, కొత్తపెల్లి రాజంలు ద్విచక్రవాహనంపై మేకల మందుల నిమిత్తం కోరుట్లకు బయలుదేరారు. వెంకటాపూర్ బస్టాండ్ వద్ద ద్విచక్రవాహనాన్ని జగిత్యాల వైపు నుంచి వస్తున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో హన్మాండ్లు అక్కడికక్కడే మృతిచెందాడు. రాజంకు తీవ్రగాయాలుకాగా చికిత్స నిమిత్తం అంబులెన్సులో ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య నర్సు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మానవత్వం చాటిన ఎంవీఐ..

ప్రమాదం జరిగిన సమయంలో కోరుట్ల ఎంవీఐ రంజిత్ కుమార్ జగిత్యాల వైపు వెళ్తున్నారు. తన వాహనాన్ని ఆపి క్షతగాత్రున్ని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

జిల్లాకేంద్రంలో మరో వ్యక్తి..



షేక్ మహ్మద్ హుస్సేన్ మృతదేహం

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని బస్‌డిపో వద్ద జగిత్యాల–కరీంనగర్ ప్రధాన రహదారిపై సోమవారం ద్విచక్రవాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో షేక్ మహ్మద్ హుస్సేన్ (42) మృతిచెందాడు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మహ్మదీయ కాలనీకి చెందిన షేక్ మహ్మద్ హుస్సేన్ పని నిమిత్తం కరీంనగర్‌కు ద్విచక్రవాహనంపై వెళ్లి సోమవారం ఉదయం నిజామాబాద్‌కు వెళ్తుండగా జగిత్యాల బస్ డిపో వద్ద ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో షేక్ మహ్మద్ హుస్సేన్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108లో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. మృతుడి భార్య ఖాజామా అసోం ఫిర్యాదు మేరకు ఆర్టీసీ డ్రైవర్ నాంపల్లి సమ్మయ్యపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రాంచందర్‌రావు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న ఆటో..

ధర్మపురి : ఆటో బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సోమవారం ఆటో బైక్‌ను ఢీకొనడంతో ధర్మపురికి చెందిన రంజిత్ అనే యువకుడికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఆటో బైకులు స్వల్పంగా దెబ్బతిన్నాయి.

బజ్జీలలో గంజాయి


గంజాయి మొక్కను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్సై

కోనరావుపేట(వేములవాడ):హోటల్‌లో అమ్మే బజ్జీలలో గంజాయి కలుపుతూ ప్రజలను వ్యసనానికి గురిచేస్తున్న నిర్వాహకులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాలు. మండలంలోని నిజామాబాద్‌లో ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చిన రిజ్వాన్ హోటల్ నడుపుతుంటాడు. మిర్చీలు, బజ్జీలలో గంజాయిని కలుపుతూ విక్రయిస్తున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు రిజ్వాన్ ఇంటిపై దాడి చేయగా.. గంజాయి ప్యాకెట్ లభించింది. ఈ విషయమై విచారించగా విజయ్ తన ఇంటి ముందు గంజాయి మొక్కలను పెంచుతున్నాడని తెలిసింది. గంజాయి ఆకులను ఎండబెట్టిన తర్వాత మిర్చీలు, బజ్జీలలో కలుపుతున్నట్లు అంగీకరించాడు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి 2.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి, కానిస్టేబుళ్లు దండి నరేశ్, జగన్, సత్యం, నాగరాజు ఉన్నారు.